నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ మంగళవారం 23-2-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక: 174 పేజీలు: 4 వెల: రూ.1/-

మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ మేయర్‌గా గద్వాల విజయలక్ష్మి సోమవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి మంత్రి తలసాని, కె.కేశవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి తన కార్యాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో పూజలు చేసి.. బాధ్యతలు స్వీకరించారు. సర్వమత ప్రార్థనలు జరిపి.. ఆమెకు ఆశీర్వచనం ఇచ్చారు పూజారులు. తర్వాత.. విజయలక్ష్మి తండ్రి.. రాజ్యసభ సభ్యులు కేకే ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్లు, అధికారులు కొత్త మేయర్ కు విశేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్, కేకే, ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా గెలుపొందిన విజయలక్ష్మిని జీహెచ్ఎంసీ మేయర్‌గా, శ్రీలతని డిప్యూటీ మేయర్‌గా ఈ నెల 11న ఎన్నుకున్న సంగతి తెలిసిందే.

మహారాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్‌కు కరోనా

మళ్లీ విజృంభిస్తున్న కరోనాతో ఆందోళన

ముంబై,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో ఆహారం, పౌరసరఫరాల శాఖ మంత్రి ఛగన్ భుజ్‌బల్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. ఈ విషయాన్నిఆయనే స్వయంగా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. అయితే, తన ఆరోగ్యం బాగానే ఉన్నదని, పరీక్షల్లో కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో హోమ్ క్వారెంటైన్‌లో ఉన్నానని చెప్పారు. ఇటీవల తనతో సన్నిహితంగా ఉన్న నేతలు, మంత్రులు కూడా కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉండాలని ఆయన సూచించారు. కాగా, ఛగన్ భుజ్‌బల్‌తో కలిసి ఈ నెల మహారాష్ట్రలో కరోనా మహమ్మారి బారిన పడిన మంత్రుల సంఖ్య ఏడుకు చేరింది. ఇప్పటికే అనిల్ దేశ్‌ముఖ్, రాజేంద్ర షింగ్నే, జయంత్ పాటిల్, రాజేశ్ తోపే, సతేజ్ పాటిల్, బచ్చు కదూ కరోనా బారినపడ్డారు. ఇదిలావుంటే మహారాష్ట్రలో కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తున్నది. గత కొన్ని రోజులుగా కొత్త కేసులు వేగంగా పెరుగుతున్నాయి. యవత్మాల్, చంద్రపూర్, నాందేడ్, జిల్లాలతోపాటు నాగ్‌పూర్, అమరావతి జిల్లాల్లో కొత్త కేసులు భారీగా నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమరావతి జిల్లాలో ఇప్పటికే కరోనా కట్టడికి లాక్‌డౌన్‌ను అమల్లోకి తెచ్చారు. నాగపూర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేశారు. పరిస్థితులు మళ్లీ తీవ్రంగా మారుతుండటంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే ఆ రాష్ట్ర ప్రజలకు గట్టి హెచ్చరికలు చేశారు. మాస్కులు ధరించడం, సామాజిక దూరం పాటించడం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, కేసుల సంఖ్య ఇలాగే పెరిగితే మరోసారి రాష్ట్రవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించాల్సి వస్తుందని స్పష్టంచేశారు. వచ్చే రెండు వారాలు కూడా కేసులు ఇలాగే పెరిగితే ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా సెకండ్ వేవ్ కొనసాగుతుందా లేదా..? అనే విషయం త్వరలోనే స్పష్టమవుతుందని ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు. ఇప్పటికే అమరావతి, అకోలా తదితర ప్రాంతాల్లో పరిస్థితి చేయి దాటి పోయిందని, దాంతో అక్కడ లాక్‌డౌన్ విధించామని చెప్పారు. కాగా, మహారాష్ట్రలో ఆదివారం కొత్తగా 6,281 కొవిడ్ కేసులు నమోదయ్యాయి. దాంతో ఆ రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కరోనా కేసుల సంఖ్య 20,93,913కు చేరింది.

వాణిదేవికి బిఫామ్ అందచేసిన సిఎం కెసిఆర్

ఉన్నతస్థాయి సమీక్షలో నేతలకు పరిచయం

పివి తనయ గెలుపునకు కృషి చేయాలని దిశానిర్దేశం

పివి ఘాట్, గన్‌పార్క్ వద్ద నివాళి అర్పించిన వాణీదేవి

అనంతరం గ్రేటర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ అభ్యర్థి వాణిదేవికి సిఎం కేసీఆర్ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి బీ ఫార్మ్ అందజేశారు. అనంతరం పార్టీ నేతలు వెంటరాగా ఆమె జీహెచ్ఎంసీ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సురభి వాణిదేవి, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, టీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై నేతలకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. గెలుపునకు కృషి చేయాలన్నారు. టీఆర్ఎస్ నేతలు, మంత్రులకు వాణి దేవిని కేసీఆర్ పరిచయం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకుని వాణి దేవి గెలుపు కోసం పనిచేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, కేటీఆర్, తలసాని, సబితా ఇంద్రారెడ్డి, నిరంజన్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజ్యసభ ఎంపీ కేకే, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం వాణిదేవి.. గన్‌పార్క్‌కు వెళ్లారు. అక్కడ అమరవీరుల స్తూపానికి వాణిదేవి నివాళులర్పించారు. గన్ పార్క్ వద్ద నివాళులర్పించిన వారిలో మంత్రులు తలసాని శ్రీనివాస యాదవ్, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, మహేశ్ రెడ్డితో పాటు టీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. అనంతరం తన నామినేషన్‌ను దాఖలు చేసేందుకు జీహెచ్ఎంసీ కార్యాలయానికి బయల్దేరారు. సీఎంతో సమావేశం కంటే ముందు.. నెక్లెస్ రోడ్డులోని పీవీ ఘాట్ వద్ద వాణిదేవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఇదిలావుంటే మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానానికి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూతురు సురభి వాణీ దేవి పోటీచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర పార్టీల వారు పోటీ నుంచి తప్పుకుని, ఎమ్మెల్సీగా వాణీదేవి ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా సహకరించాలని టీఆర్ఎస్ స్టేట్జ్లాండ్ అధ్యక్షుడు శ్రీధర్ గందె అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆమెను ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ప్రస్తుతం పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయని, ఈ సందర్భంగా ఆయన కుమార్తెను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పీవీ పట్ల మనకున్న గౌరవానికి నిదర్శమని చెప్పారు.

రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించేలా కృషి

తేజాస్ యుద్ధ విమానాల తయారీయే ప్రబల సంకేతం

రక్షణరంగంపై జరిగిన వెబినార్‌లో మోడీ ప్రసంగం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు భారత్ విశేషంగా కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రక్షణ రంగ పరికరాల దిగుమతులను నియంత్రిస్తూ భారత్‌లోనే తయారీని ముమ్మరం చేస్తే ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నివారించడంతో పాటు ఉద్యోగాలూ సమకూరుతాయని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రక్షణ రంగ కేటాయింపులు సమర్థ వినియోగం అనే అంశంపై ప్రధాని మోదీ సోమవారం జరిగిన ఓ వెబినార్‌లో ప్రసంగించారు. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణ రంగ దిగుమతిదారుల్లో ఒకటిగా ఉందని, ఈ రంగంలో స్వయం సమృద్ధి సాధించేందుకు మనం అహరహం శ్రమిస్తున్నామని చెప్పారు. రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధికి తేలికపాటి తేజాస్ యుద్ధ విమానాలే ప్రబల సంకేతమని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానంతరం భారత్ చరిత్రలో తొలిసారిగా రక్షణ రంగంలో ప్రైవేట్ రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశ రక్షణ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు మనకు నిర్దిష్ట కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక అవసరమని పిలుపు ఇచ్చారు. ఆయుధాలు, సైనిక పరికరాల తయారీలో భారత్‌కు దశాబ్దాల అనుభవం ఉందని అన్నారు. తొలి, మలి ప్రపంచ యుద్ధాల సందర్భంగా భారత్ ఆయుధాలు, సాధనా సంపత్తిని సరఫరాలు చేయగా, స్వాతంత్ర్యానంతరం ఈ సామర్థ్యాన్ని బలోపేతం చేయలేదని అన్నారు. చిన్నపాటి ఆయుధాల కోసం మన చిన్న దేశాలపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. భారత్ ప్రస్తుతం ఈ సామర్థ్యాలను వేగవంతంగా పెంచుకునేందుకు కట్టుబడి ఉందని అన్నారు. అసోం రాష్ట్రంలో సోమవారం ప్రధాని మోదీ పర్యటించారు. ధేమాజిలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర మౌళికసదుపాయాల్ని అభివృద్ధి పరిచేందుకు స్థానిక ప్రభుత్వంతో కలిసి కేంద్రం పనిచేస్తోందన్నారు.

అస్సాంలో అనేక వనరులు ఉన్నాయని, కానీ గత ప్రభుత్వాలు సవతిలా చూశాయని, దాంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ధేమాజిలోని సిలాపత్తర్‌లో ప్రధాని మోదీ పలు ప్రాజెక్టులను ఆవిష్కరించారు. రాష్ట్రంలో ఉన్న టీ, టూరిజం, చేనత, హ్యాండీక్రాఫ్ట్ రంగాలు ఈ రాష్ట్రాన్ని స్వయం సమృద్ధిగా మారుస్తున్నాయన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాశ్ నినాదంతో సీఎం శరబానంద సోనావాల్ పనిచేశారని కితాబిచ్చారు. బోగీబీల్ బ్రిడ్జ్‌ను పూర్తి చేశామని, బ్రహ్మపుత్రపై నిర్మించిన కలియబొమెర బ్రిడ్జ్ నిర్మాణంతో అస్సాంలో కనెక్టివిటీ పెరిగిందని ప్రధాని అన్నారు. రాష్ట్రంలో ఫోర్‌లేన్ రహదారి పనులు కూడా పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు. అస్సామీ ప్రజలకు కావాల్సినవన్నీ అస్సాంలో ఉన్నాయని, కేవలం డబుల్ ఇంజిన్ ప్రగతి కావాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని రెట్టింపు చేస్తానని హామీ ఇస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.

వైద్యారోగ్యశాఖను అప్రమత్తం చేసిన మంత్రి ఈటల

హైదరాబాద్, ఫిబ్రవరి22: సరిహద్దు రాష్ట్రాల్లో కరోనా కేసులు అనూహ్యంగా పెరగడంపై తెలంగాణ వైద్యారోగ్యశాఖను మంత్రి ఈటల రాజేందర్ అప్రమత్తం చేశారు. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వ్యాక్సిన్‌ను మార్కెట్‌లో అందుబాటులోకి తేవాలని కోరారు. 50ఏండ్లు దాటిన దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి త్వరగా వ్యాక్సిన్ ఇవ్వాలని అన్నారు.

'కర్ణాటక, ఛత్తీస్‌గఢ్‌లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో కొత్త కేసులు పెరగకుండా కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టాం. రాష్ట్రంలో కొవిడ్ పరీక్షలు పెంచుతాం. గాంధీ, టిమ్స్, నిమ్స్‌లో మళ్లీ పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతానికి కేసులు భారీగా పెరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతానికి కర్ఫ్యూపై ఎలాంటి ఆలోచన లేదు. కరోనా ఉన్నంతకాలం ప్రజలు జాగ్రత్తగా ఉండాలని' మంత్రి సూచించారు.

ఓడిపోయే సీటిచ్చారు: పీవీ మనవడు

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌పై పీవీ మనవడు, బీజేపీ నేత ఎన్వీ సుభాష్ మండిపడ్డారు. నగరంలో మీడియాతో సోమవారం మాట్లాడిన ఆయన.. టీఆర్ఎస్ నుంచి తమ చిన్నమ్మ వాణీదేవికి టికెట్ ఇవ్వడాన్ని ప్రస్తావించారు. ఓడిపోయే స్థానంలో అవకాశమిచ్చారని విమర్శించారు. కుటిల రాజకీయాలతో మహామనిషి పేరు చెప్పి తమ కుటుంబాన్ని వెూసం చేశారన్నారు. బ్రాహ్మణ సమాజం ఓట్లు చీల్చేందుకు ప్రయత్నమిది అన్నారు. పీవీ కుమార్తెను బలిపశువును చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రరావు అన్నారు. తనపై కేసీఆర్, కేటీఆర్ పోటీచేసినా ఓడిపోతారని ధీమా వ్యక్తం చేశారు. పీవీ కుమార్తెను రాజ్యసభకు నామినేట్ చేయొచ్చు కదా? ప్రశ్నించారు. కేవలం ఓడించడం కోసమే పీవీ కుటుంబాన్ని.. కేసీఆర్ రోడ్డు మీదకు తీసుకొచ్చారన్నారు

బార్ కౌన్సిల్ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): బార్ కౌన్సిల్ పరీక్ష (ఏఐబీఈ) వాయిదా పడింది. ఈ విషయాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఒక అధికార ప్రకటనలో వెల్లడించిది. ఆలిండియా బార్ పరీక్షకు కొత్త షెడ్యూల్ ప్రకటించడంతోపాటు పరీక్షకు దరఖాస్తు దాఖలు తేదీని కూడా పొడగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. నిజానికి ఈ పరీక్ష వచ్చే నెల 21 న జరుగాల్సి ఉన్నది. సవరించిన షెడ్యూల్ ప్రకారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పుడు 2021 ఏప్రిల్ 25 న ఆల్ ఇండియా బార్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తుందని పేర్కొన్నది. మార్చి 21 న జరుపతలపెట్టిన పరీక్షను కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా వాయిదా వేశారు. దీనితో పాటు బీసీఐ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవలసిన చివరి తేదీని కూడా పొడిగించారు. పరీక్షకు హాజరు కావాలనుకునే అభ్యర్థులు ఇప్పుడు 2021 మార్చి 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఆన్‌లైన్ ఫారం నింపడానికి చివరి తేదీ 2021 మార్చి31. పరీక్షకు అడ్మిట్ కార్డులు 2021 ఏప్రిల్ 10 న జారీ చేయబడుతుంది. అంతకుముందు దరఖాస్తు దాఖలుకు చివరి తేదీని ఫిబ్రవరి 26 గా ప్రకటించారు.

టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జిలతో కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్, ఫిబ్రవరి 23: టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జిలతో వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెలాఖరు నాటికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

పార్టీ సభ్యత్వ నమో దుతో పాటు, మెంబర్షిప్ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని సైతం సమాంతరంగా కొనసా గించాలని ఇన్‌ఛార్జిలకు కేటీఆర్ సూచిం చారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా కొనసాగుతోందని అన్నారు. పార్టీ నిర్ణయించుకున్న లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు విజయవంతం కాబోతున్నదని చెప్పారు. ఈ సందర్భంగా కేటీఆర్ పార్టీ సభ్యత్వ నమోదు పైన జిల్లాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని పార్టీ నాయకులు కేటీఆర్‌కు తెలిపారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో నిర్దేశిత లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు కొనసాగుతున్న విషయాన్ని పార్టీ నేతలు కేటీఆర్‌కు వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ శ్రేణులంతా కలిసి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేటీఆర్ సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతున్న తీరుపైన మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎస్సీ గురుకుల కాలేజీలో అడ్మిషన్లు

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): నగర శివార్లలో ఉన్న ఘట్‌కేసర్ ఎస్సీ గురుకుల మహిళా లా కాలేజీలో స్పాట్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదలయ్యింది. ఈ నెల 25న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని సంక్షేమశాఖ కమిషనర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ, ఎల్ఎల్‌బీ కోర్సులో అడ్మిషన్లు కల్పిస్తామని వెల్లడించారు. ఘట్‌కేసర్ లా కాలేజీలో వచ్చే గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అడ్మిషన్ పక్రియ కొనసాగుతుందని చెప్పారు. లాసెట్ ర్యాంకు ఆధారంగా స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామని తెలిపారు.

రేపు మంచినీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలో ఈ నెల 24న మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని వాటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

నగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణా ఫేస్-2లో 1600 ఎంఎం మెయిన్ రింగ్-2 ఎల్బీ నగర్ జంక్షన్ నుంచి బావర్చి వరకు ఉన్న పైపులైనుకు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ నెల 24న బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి గురువారం(25వ తేదీ) ఉదయం ఆరు గంటల వరకు ఈ మరమ్మతు పనులు సాగనున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలోని కొన్నిప్రాంతాల్లో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. బాలాపూర్, మైసారం, బార్కాస్, మేకలమండి, భోలక్‌పూర్, తార్నాక, లాలాపేట్, బౌద్ధనగర్, మారేడ్‌పల్లి, కంట్రోల్ రూమ్, రైల్వేస్, ఎంఈఎస్, కంటోన్మెంట్, ప్రకాష్‌నగర్, పాటిగడ్డ, హస్మత్‌పేట్, వైశాలీనగర్, బీఎన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, ఆటోనగర్, మారుతీనగర్, రామంతాపూర్, ఉప్పల్, నాచారం, హబ్సిగూడ, చిలుకానగర్, బీరప్పగడ్డ, బోడుప్పల్, బడంగ్‌పేట్, మీర్‌పేట్ రిజర్వాయర్ ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదని వివరించారు.

బడ్జెట్‌పై అధికారులతో ఈటెల కసరత్తు

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): బడ్జెట్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మంత్రి ఈటల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ కోటిలోని డీఎంఈ కార్యాలయంలో సమావేశం ప్రారంభమైంది. వైద్య ఆరోగ్యశాఖలో అవసరం అయిన పరికరాలు, నిధుల అవసరంపై చర్చ నిర్వహించనున్నారు. మరోసారి పక్క రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. కేసులు నమోదు కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమావేశంలో చర్చించనున్నారు.

చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ పశుభక్షక పాటింపక
పురవీథుల శుభ్రపరుచు పురికలూ॰చి
పురు దంబుల నేర్పరచుచు
కరసేవను జేసినాడు గాంధీ బాబా !!

(ఫిబ్రవరి 21 సంత్‌గాడ్గేబాబా జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

"రైతు జీవితం" అంశంపై కవితలకు ఆహ్వానం..

రైతే రాజన్నారు
రైతే దేశానికి వెన్నెముక అన్నారు
రైతు లేనిదే దేశానికి ప్రగతి లేదన్నారు
రైతే అన్నదాత అన్నారు
తినే ప్రతి గింజమీద మనపేరు ఉంటుందని
అలాంటి ప్రతి గింజను పండించే రైతే
పరబ్రహ్మ స్వరూపం అన్నారు
మరి ఈ రోజు రైతు పరిస్థితి ఏమిటి?
ఎండనక, వాననక
నడిరోడ్డుపై నిస్సహాయంగా చూసే పరిస్థితి
ఈరోజు ఎందుకొచ్చింది?
నేలతల్లిని నమ్ముకున్న రైతుకు
పోరాటం ఎందుకు చేయాల్సి వస్తోంది?

మీ కలాలు ఇచ్చే సమాధానం ఏమిటి?

పాతిక వాక్యాలు మించకుండా
రైతు సమస్య పరిష్కార దిశగా
కలాలను కదిలించండి..

'నేటినిజం' దినపత్రిక,
ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20
లేదా E-mail : netinizam2020@gmail.com
పేజ్‌మేకర్ ఓపెన్‌ఫైల్, అనుస్ట్రిప్ట్-7లో డిటిపి చేసి మెయిల్ చేయండి..

ఉత్తమమైన కవితలతో 'నేటినిజం' ప్రత్యేక సంచికను వెలువరిస్తుంది. వెంటనే మీ రచనలు పంపగలరు.

మోడీ ప్రైవేటీకరణను వ్యతిరేకించని సిఎంలు

నేటినిజం
మంగళవారం 23-2-2021

బిజెపి ప్రైవేట్ మంత్రం జపిస్తోంది. వేగంగా దానిని విస్తరిస్తోంది. సిఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్మొహ మాటంగా ప్రైవేటీకరణపై ప్రధాని మోడీ కుండబద్దలు కొట్టారు. తాజాగా విశాఖ ఉక్కు విషయంలో జరుగుతున్న ఉదంతమే ఇందుకు నిదర్శనం. ఇకపోతే ప్రైవీటకరణ అన్నది కేంద్ర విధానంగా కనిపిస్తోంది.

దేశ అభివృద్ధిలో ప్రైవేటు రంగానిదే కీలక పాత్ర అని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పేర్కొన్నారు. ప్రభుత్వానిది సంధానకర్త పాత్ర మాత్రమేనని, 2021-22 బ్జడెట్ సారాంశం ఇదేనని తెలిపారు. బెంగళూరులో పారిశ్రామిక, వాణిజ్య మండలి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రధాని మోడీ నిర్ణయాలకు కొనసాగింపుగా చూడాలి. ప్రైవేటు రంగం ప్రాధాన్యం ఎంతో ఉందని, దాన్ని బలోపేతం చేయకపోవడం వల్లే భారత్ గొప్ప అవకాశాలను కోల్పోతోందన్న పల్లవి అందుకోవడం చూస్తుంటే విశాఖ ఉక్కులాంటి ఎన్నో సంస్థలు ఇక అంతర్ధానం కానున్నాయి. వ్యవసాయచట్టాలను రద్దు చేయడంతోపాటు విద్యుత్ చట్టసవరణలను ఉపసంహరించుకోవాలని దేశవ్యాప్తంగా రైతులు గత మూడు నెలలుగా ఉద్యమిస్తున్నా వాటిని బేఖాతరు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, పెట్రో ధరలు విపరీతంగా పెంచుతూ పోతున్నారు. ప్రజల నడ్డి విరిచేలా తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే భవిష్యత్‌లో బతికి బట్ట కడుతామా అన్న భయం ప్రజల్లో నెలకొంది. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేవలం దేశంలో అనేకమంది పారిశ్రామిక వేత్తలు, వ్యాపార దిగ్గజాలకు సంతృప్తికరంగా ఉందేమో తప్ప ప్రజలకు మాత్రం ఎక్కడా ఉపయోగంగా లేదు. ఇదంతా ప్రైవీటీకరణ మంత్రంగా చూడాలి. బ్యాంకులను, బీమా సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వ ఆస్తులను అమ్మడం, బీమారంగంలో విదేశీ పెట్టుబడులను 74 శాతానికి పెంచడం, మొండి బాకీలకోసం ఒక ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలు అన్నీ కూడా ప్రైవేటీకరణకు ఊతమిచ్చేలా ఉన్నాయి. ప్రభుత్వం క్రమంగా వివిధ రంగాల నుంచి తప్పుకుని ప్రైవేట్ రంగానికి మరింత పాత్ర కల్పించాలన్న విషయంలో మోదీ సర్కార్ దూకుడుగానే ఉంది. సిఎంలతో ఈ విషయం ప్రస్తావన సందర్భంగా ఎవరు కూడా వ్యతిరేకించలేదు. సరికాదా కిమ్మనకుండా ఉన్నారు. ఎవరికి వారు తమకున్న లోపాలను, తప్పులను ఎక్కడ బయటపడతాయె అన్న బెంగలో ప్రధాని మోడీని వ్యతిరేకించడం లేదు. 15వ ఆర్థిక సంఘం నివేదిక సైతం గ్రామాల్లోకి మార్కెట్ చొచ్చుకువెళ్ళాలన్న ఉద్దేశాన్ని ప్రకటించింది. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త సాగు చట్టాలు వ్యవసాయరంగం రూపురేఖలు మారుస్తాయని, గ్రామాల్లో ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెట్టడమే సమస్యలకు తగిన పరిష్కారమని పేర్కొనడం కూడా ప్రైవేటీకరణలో భాగంగా చూడాలి. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతగా బరితెగింపుగా దిగలేదు. సంస్కరణ లకు ఆద్యుడైన పివి నరసింహారావు కూడా ఇంతగా తెగించి మాట్లాడలేదు. నిజానికి 1991లో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రారంభమైన సంస్కరణలు పుణ్యమా అని ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారు. ఆ చర్యలు మంచి మలుపు తీసుకున్నాయి. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రూ. 9,961 కోట్ల మేరకు ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది. కేవలం మైనారిటీ వాటాలనే ఉపసంహరించడాన్ని పీవీ అనుమతిం చారు. వాజపేయి హయాంలో పెట్టుబడుల ఉపసంహరణ ఒక వెల్లువలా సాగింది. పెట్టుబడుల ఉపసంహరణకు అరుణ్ శౌరీ నేతృత్వంలో ఒక మంత్రిత్వ శాఖనే ఏర్పాటు చేసి, విదేశీ సంచార్ నిగమ్, మారుతి సుజుకి, ఓఎన్‌జీసీ, బాల్కో, హిందుస్తాన్ జింక్ మొదలైన కంపెనీలలో భారీ ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వ రంగంలోని హోటళ్లను పూర్తిగా అమ్మి వేశారు. ప్రభుత్వ బ్యాంకులన్నిటిలోనూ 33 శాతం వాటాలను అమ్మాలని అప్పుడే ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా ప్రతిపాదించారు కాని అది అమలు కాలేదు. వాజపేయి హయాంలో రూ.33,655 కోట్ల మేరకు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. వామపక్షాలు అడ్డుకోవడం వల్ల యూపీఏ మొదటి ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమం వేగవంతం కాలేదు. ఆ తొలి అయిదేళ్లలో కేవలం రూ. 8,515 కోట్ల మేరకే పెట్టుబడులను ఉపసంహరించగలిగారు. అయితే యూపీఏ రెండవ సారి మళ్లీ అధికారంలోకి రాగానే ప్రభుత్వరంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహ రణను ప్రధాని మన్మోహన్ సింగ్ వేగవంతం చేశారు. ఎన్‌హెచ్‌పిసితో ప్రారంభమైన పెట్టుబడుల ఉపసంహ రణ వివిధ రంగాల్లోకి విస్తరించి దాదాపు రూ.99,000 కోట్ల మేరకు సాగింది. ప్రభుత్వరంగ సంస్థలు మార్కెట్ లో ఇతర ప్రైవేట్ సంస్థలతో సమానంగా పోటీపడాలని, మంచి లాభాలను ఆర్జించాలన్నదే తమ ఉద్దేశమని, అవి పెట్టుబడులకోసం మార్కెట్‌లో ప్రవేశిస్తే తమకు అభ్యంతరం లేదని మోడీ అంటున్నారు. అసలు ప్రైవేటీకరణ తమ సిద్ధాంతం అన్న విధానంగా చెబుతున్నారు. నరేంద్ర మోదీ ప్రైవేటీకరణ చాలా ముఖ్యమైనదని బలంగా విశ్వసిస్తున్నారు. ఆయన రెండవ సారి ప్రధానమంత్రి అయిన తర్వాత ఈ విషయం మరింత స్పష్టమవుతోంది. వాజపేయి కన్నా మోదీ రెండాకులు ఎక్కువ చదివారు. మోదీ తొలి ప్రభుత్వ కాలంలోనే రూ. 2లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తాజా బ్జడెట్‌లో మోదీ ప్రభుత్వం జాతీయ హైవే అథారిటీ, రైల్వే, చమురు, సహజవాయు సంస్థల ఆస్తులను అమ్మారు. 1.74 లక్షల కోట్లను సేకరిస్తామని ప్రకటించింది. మొత్తం ప్రభుత్వరంగ సంస్థలన్నిటినీ ప్రైవేటీకరణ చేస్తామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అణు ఇంధనం, అంతరిక్షం, రక్షణ, రవాణా, టెలికమ్యూనికేషన్లు, విద్యుత్, పెట్రోలియం, బొగ్గు, ఖనిజవనరులు, బ్యాంకింగ్, మైనింగ్, ఆర్థిక సర్వీసుల్లో ప్రభుత్వం నామమాత్రంగా కొనసాగుతుందని ఆమె చెప్పారు. ఆస్తుల అమ్మకం ద్వారా సేకరించిన ఈ మొత్తాన్నంతా మౌలిక సదుపాయాల అభివృద్ధికి మళ్లించడం వల్ల పెద్ద ఎత్తున ఉపాధి కల్పన జరుగుతుందని చెబుతున్నారు. కానీ ఇది ఎంతవరకు సఫలమో గతానుభవాలను చూస్తే తెలుస్తుంది. అయినవారికి బంగారు పళ్లెంలో వడ్డించడానికి చేస్తున్న కుట్రగానే చూడాలి.

పార్టీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ బీమా

వరంగల్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): దేశంలో పార్టీ సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికి బీమా సౌకర్యం కల్పించిన ఘనత టీఆర్ఎస్‌కే దక్కుతుందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. జిల్లాలోని రాయపర్తి మండలం ఆరెగూడెంకు చెందిన 30 మంది కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు అధికారపార్టీలో చేరారు. హన్మకొండలో జరిగిన కార్యక్రమంలో వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దేశంలో 60 లక్షల సభ్యత్వాలను ఆన్‌లైన్ చేసిన ఏకైక పార్టీ టీఆర్ఎస్ అన్నారు. పార్టీలో చేరిన ప్రతి సభ్యుడికి సముచిత గౌరవం దక్కుతుందని చెప్పారు. పార్టీలో చేరినవారిలో యార మహేందర్, ఉపేందర్, అనుమల యాకయ్య, సుధాకర్, నాగయ్య తదితరులు ఉన్నారు.

వరవరరావుకు షరతులతో కూడిన బెయిల్

ముంబై,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ):విరసం నేత, విప్లవ కవి వరవరరావుకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. భీమా కొరేగావ్ కేసుకు సంబంధించి జైల్లో ఉన్న ఆయనకు సోమవారం బొంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రత్యేక షరతులతో ఆరునెలల మెడికల్ బెయిల్ మంజూరు చేసింది. స్పెషల్ ఎన్ఐఏ కోర్టు పరిధిలోనే (ముంబైలోనే) ఉండాలని, అలాగే గత ఎఫ్ఐఆర్‌కు దారి తీసిన కార్యకలాపాలు చేయ గూడదంటూ షరతులు విధించింది. దీంతో వరవరరావు ఆరోగ్యంపై ఇప్పటికే తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు, పౌర హక్కుల సంఘాల ప్రతినిధులకు భారీ ఊరట లభించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం తన భర్తకు బెయిల్ ఇవ్వాలన్న వరవరావు భార్య పిటీషన్‌పై కోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ పరిస్థితుల్లో ఆయనను జైలుకు పంపడం సరికాదని భావించిన కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అవసరమైనప్పుడు రావు విచారణకు హాజరుకావాలని, అయితే భౌతిక హాజరునుంచి మినహాయింపు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కోర్టు పేర్కొంది. మరోవైపు ఈ ఉత్తర్వుపై మూడు వారాల పాటు స్టే విధించాలని కోరిన అదనపు సొలిసిటర్ జనరల్ అనిల్ సింగ్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. ఇటీవల కరోనా సోకడంతోపాటు, తీవ్ర అనారోగ్యంతో ఉన్న తన భర్త వరవరావును బెయిల్‌పై విడుదల చేయాలని కోరుతూ భార్య హేమలత బొంబే హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

డీజిల్ ధరల ఎఫెక్ట్.. పెరిగిన ఆటో, ట్యాక్సీ ఛార్జీలు

ముంబై, ఫిబ్రవరి 22: ప్రతిరోజూ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యులకు మరో షాక్ ఇచ్చాయి. ముంబైలో ఆటో, ట్యాక్సీల ఛార్జీలు పెరిగాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో కనీస ఛార్జీపై రూ.3 పెంచారు. ఇప్పటి వరకూ ఆటోల్లో కనీస ఛార్జీ రూ.18గా ఉండగా.. ఇక నుంచి అది రూ.21కి చేరనుంది. ఇక ఖాళీపీలీ ట్యాక్సీల్లో కనీస ఛార్జీ రూ.22 నుంచి రూ.25కు పెరిగింది. ఇంధన ధరలతోపాటు మెయింటెనెన్స్, ఇన్సూరెన్స్ ధరలు పెరిగినా.. ఐదేళ్లుగా ఛార్జీలు పెంచలేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఈ తాజా పెంపును ముంబై, థానె, నవీ ముంబైలలోని ఆటో డ్రైవర్ అసోసియేషన్లు స్వాగతించాయి. ముంబైలో ఇప్పటికే పెట్రోల్ ధర రూ.97 మించిపోగా.. డీజిల్ రూ.88 మార్క్ దాటింది.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో విఫలం

ఎన్నికల కమిషన్ తీరుపై మండిపడ్డ బాబు

విజయవాడ గ్రూపు రాజకీయాలపై పార్టీ నేతలతో చర్చ

అమరావతి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల కమిషన్ తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయా? అని ప్రశ్నించారు. ఎస్ఈసీ పరిధిలో ఉన్న అధికారాలను ఉపయోగించి ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిపించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఎన్నికల కమిషన్ ఎందుకు అమలు చేయలేదని నిలదీశారు. టీడీపీ ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఎస్ఈసీ చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రోడ్లుపై ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఓటర్లు ప్రయత్నం చేస్తుంటే.. ఎన్నికల కమిషన్ నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. అధికార యంత్రాంగం బరితెగిస్తే వాళ్లపై చర్యలు తీసుకోలేదన్నారు. టీడీపీ గెలిచిన స్థానాలను వైసీపీ గెలిచినట్లు ప్రకటించారని.. ఆ అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎస్ఈసీని ప్రశ్నించారు. చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి జరిగిందని, వైసీపీ నేతల బెదిరింపులతో ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేద్దామని అనుకున్నవాళ్లు కూడా రాలేకపోయారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే టీడీపీ నేతలు బుద్దా వెంకన్న, నాగుల మీరాకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. దీంతో టీడీపీ సెంట్రల్ ఆఫీస్‌కు ఇద్దరు నేతలు వచ్చారు. బెజవాడ పార్టీలో గ్రూప్ గొడవలపై నేతలను చంద్రబాబు పిలిపించారు. ఇప్పటికే ఎంపీ కేశినేని నాని, వెంకన్నతో పలుమార్లు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడారు. బెజవాడ వర్గపోరుకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు చేస్తోంది. విజయవాడ కార్పొరేషన్ ఎన్నికల వేళ పార్టీ నేతలు అంతర్గత విభేదాలతో రచ్చకెక్కి మాటల యుద్ధానికి దిగడాన్ని టీడీపీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై పార్టీ నాయకులు బహిరంగంగా ఒకరిపై మరొకరు వ్యక్తిగత విమర్శలు చేసుకుంటూ పార్టీ పరువును బజారుకీడిస్తే సహించేది లేదని హెచ్చరించింది. వీఎంసీ ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 39వ డివిజన్ నుంచి టీడీపీ అభ్యర్థిగా శివశర్మను ఎంపీ కేశినేని నాని బలపరుస్తుండగా, అదే డివిజన్ నుంచి మాజీ వి÷-లోర్ లీడర్ గుండారపు హరిబాబు కుమార్తె పూజితను బుద్దా వెంకన్న, నాగుల్‌మీరాలు బలపరుస్తున్న సంగతి తెలిసిందే. ఒకే పార్టీ నుంచి ఇరువర్గాల నాయకులు అభ్యర్థులను నిలబెట్టి పోటాపోటీగా కార్యాలయాలను ప్రారంభించారు. ఇరువర్గాల నాయకులు పంతాలు, పట్టింపులకు పోతూ పరస్పరం వ్యక్తిగత విమర్శలకు దిగడంతో ఇరువర్గాల ఆధిపత్య పోరు వీధికెక్కింది. ఎంపీ కేశినేని, ఆయనకు వ్యతిరేకంగా ఏకమైన వర్గం మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ శృతి మించుతూ పార్టీకే నష్టం చేసే స్థాయికి చేరుకోవడంతో టీడీపీ అధిష్టానం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. ఈ సమస్యను పరిష్కరించే బాధ్యతను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడికి అప్పగించింది. దీంతో అచ్చెన్నాయుడు ఆదివారం ఉదయం శ్రీకాకుళం నుంచి విజయవాడ చేరుకుని, బుద్దా వెంకన్న, నాగుల్ మీరాలతో భేటీ అయ్యారు. అచ్చెన్నాయుడి నివాసంలో దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో పార్టీలో విభేదాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెసిఆర్ అపరచాణక్యం

కాంగ్రెస్,బిజెపిలను దెబ్బకొట్టే రాజకీయం

వాణిని అభ్యర్థిగా ఎంపిక చేయడం రాజకీయ వ్యూహం

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): టిఆర్ఎస్ అధినేత, సిఎం కెసిఆర్ అపర చాణక్యం ప్రదర్శించారు. చాలాకాలం తరవాత ఆయన తన మేధస్సుకు పదునుపెట్టి పాచిక వేశారు. బిజెపిని ఎదుర్కొనే క్రమంలో తొలి అడుగుగా భావించాలి. హైదరాబాద్ -రంగారెడ్డి -మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజక వర్గం టీఆర్ఎస్ అభ్యర్థిగా తెలంగాణ ముద్దుబిడ్డ, దివంగత ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ప్రముఖ విద్యావేత్త సురభి వాణీదేవిని ఎంపిక చేయడం వెనక వ్యూహం దాగి ఉంది. బిజెపి నుంచి గత ఎన్నికల్లో రామచంద్రరావు ఎన్నికయ్యారు. ఈ సారి ఎవరిని నిలబెడతారన్న ఊహాగానాలు వచ్చాయి. కాంగ్రెస్ నుంచి మాజీమంత్రి డాక్టర్ చిన్నారెడ్డి పోటీలో ఉన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కూడా రంగంలో ఉన్నారు. వీరిని ఎదుర్కోవడం కోసం కెసిఆర్ చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు.

రామచంద్రరావును ఎదుర్కొనేందుకు బ్రాహ్మణ వర్గానికి చెందిన, విద్యావంతురాలయిన వాణీదేవిని ఎంపిక చేయడం చాలా కీలక నిర్ణయంగా భావించాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వెలువడుతున్నాయి. పీవీ కుటుంబానికి ఇచ్చిన ఈ ఆత్మీయ, అపురూప గౌరవం ఆ మహనీయుడి శతజయంతి వేళ ఆయనకు అందించే నివాళిగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రామచంద్ర రావు కూడా బ్రాహ్మణవర్గానికి చెందిన వాడు కావడంతో ఆయనను ఈ రకంగా ఢీకొనాలని కెసిఆర్ భావించి నట్లుగా ఉంది. దీనికితోడు ఇంతకాలం పివి వారసత్వ నుంచి ఎవరు కూడా రాజకీయాల్లో లేరు. ఆ సానుభూతి కూడా కలసి రానుంది. దీంతో హైదరాబాద్ ఎంఎల్‌సి స్థానానికి టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎంపికపై గతకొంత కాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. పట్టభద్రుల ఎంఎల్‌సి నామినేషన్ల గడువు మంగళవారం ముగియనుండగా, ఆదివారం సాయంత్రం టిఆర్ఎస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ స్థానానికి మాజీ ప్రధానిమంత్రి పి.వి.నరసింహారావు కుమార్తె సురభి వాణీదేవిని అభ్యర్థిగా ఖరారు చేశారు. టిఆర్ఎస్ పార్టీలో కొంతమంది ఆశావహులు ఎమ్మెల్సీ టికెట్ కోసం గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్నారు. జిహెచ్ఎంజి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు టిఆర్ఎస్ పార్టీ నుంచి అవకాశం ఇస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగినప్పటికీ ఎవరూ ఊహించని విధంగా సిఎం కెసిఆర్ వాణీదేవిని అభ్యర్థిగా ప్రకటించారు. ఖమ్మం-వరంగల్-నల్గొండ స్థానానికి టిఆర్ఎస్ పార్టీ తరపున ప్రస్తుత సిట్టింగ్ ఎంఎల్‌సి పల్లా రాజేశ్వరరెడ్డిని ఖరారు చేసిన విషయం తెలిసిందే. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలు జరుపు కుంటున్న వేళ ఆయన కుటుంబానికి కెసిఆర్ అరుదైన గౌరవం ఇచ్చినట్ఉల అయ్యింది. పీవీ కూతురు.. విద్యావేత్త, చిత్రకారిణిగా గుర్తింపుపొందిన సురభి వాణీదేవిని ఎమ్మెల్సీ నియోజకవర్గం టీఆర్ఎన్ అభ్యర్థిగా ప్రకటించడం బిజెపి,కాంగ్రెస్‌లకు ఊహించని దెబ్బగా చూడాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ అనూహ్యంగా తీసుకున్న ఈ నిర్ణయంతో టీఆర్ఎస్ విజయావకాశాలు పెరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా పీవీకి ఉన్న జనాదరణ పట్టభద్ర ఎన్నికల్లో బాగా కలసి రానుంది. తెలంగాణ ముద్దుబిడ్డ పీవీకి కాంగ్రెస్ చేసిన అవమానాలు, అన్యాయాన్ని ఎన్నికల్లో ఎత్తి చూపేందుకు అవకాశం వచ్చింది. కాంగ్రెస్‌ను ఎండగట్టడానికి తాజాగా ఇదొక మంచి అవకాశమని పలువురు రాజకీయవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వాణీదేవి విద్యాభ్యాసం, వృత్తి జీవితం మొత్తం హైదరాబాద్ కేంద్రంగానే సాగింది. 1986లో జేఎన్టీయూ నుంచి డిప్లొమా ఇన్ ఫైన్ ఆర్ట్స్‌లో పట్టాపొందారు. విద్యావేత్తగా, చిత్రకారిణిగా, సంఘ సేవకురాలిగా ఆమెకు మంచి గుర్తింపు ఉన్నది. 35 ఏండ్లుగా వందల పెయింటింగ్స్ వేసిన వాణీదేవి.. తన పెయింటింగ్స్‌తో ఇప్పటివరకు 15 ఎగ్జిబిషన్లు నిర్వహించారు. అమెరికా రాజధాని వాషింగ్టన్-డీసీలో ఉన్న గాంధీ మెమోరియల్ సెంటర్‌లో 'సారే జహాసె అచ్ఛా' పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహించి రికార్డు సృష్టించారు. వాణీదేవి పలు కళాశాలలను స్థాపించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో శ్రీవెంకటేశ్వర కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, కాలేజీ ఆఫ్ ఫార్మసీ, కాలేజీ ఆఫ్ ఆర్కిటెక్చర్‌ను నెలకొల్పారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల, కరీంనగర్ జిల్లా ముల్కనూరులో స్వామి రామానందతీర్థ సహకార జూనియర్ కళాశాల, హైదరాబాద్‌లోని బేగంపేట లో స్వామి రామానందతీర్థ మెమోరియల్ మోడల్ స్కూల్‌ను ఏర్పాటుచేసి లక్షలమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. బేగంపేటలోని స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీకి వాణీదేవి ఇంచార్జి చైర్‌పర్సన్‌గా, ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జ్యూరీ మెంబర్‌గా, సెలక్షన్ కమిటీ మెంబర్‌గా, ఉమ్మడి రాష్ట్రంలో ఉగాది పురస్కారాల ఎంపిక కోసం సాంస్కృతిక శాఖ ఏర్పాటుచేసిన జ్యూరీలో సభ్యురాలిగా పనిచేశారు. కళలు, విద్య, సమాజసేవలో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా వాణీదేవికి పలు పురస్కారాలు లభించాయి. మొత్తంగా పివికున్న పేరు ప్రఖ్యాతులు, రాజకీయ ఇమేజ్ ఇప్పుడు టిఆర్ఎస్‌కు కలసి రానున్నాయి. అలాగే పివి శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా అధికార పార్టీకి బాగా కలసివచ్చింది. మొత్తంగా ప్రధానంగా పార్టీ పరంగా కాంగ్రెస్ అభ్యర్థికి తీరని దెబ్బ. బ్రాహ్మణవర్గానికి చెందిన వ్యక్తిగా బిజెపికి కూడా దెబ్బపడే అవకాశం ఉంది. మొత్తంగా కెసిఆర్ వ్యూహాత్మకంగా వ్యవహరించారని చెప్పవచ్చు.

రైతుల కష్టాలపై పాప్ స్టార్‌లు స్పందిస్తున్నా నోరు మెదపని కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: వ్యవసాయ చట్టాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ సర్కార్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. రెండునెలలకు పైగా రైతులు దేశ రాజధాని ప్రాంతంలో నిరసనలు చేపడుతున్నా అన్నదాతల గోడును కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ పేర్కొన్నారు. కేరళలోని వయనాడ్‌లో ట్రాక్టర్ ర్యాలీ ముగింపు సందర్భంగా సోమవారం ముట్టిలో రైతులను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. మన రైతుల ఇక్కట్లను యావత్ ప్రపంచం చూసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం రైతుల గోడును ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుల దుస్థితిపై పాప్ స్టార్‌లు మాట్లాడటం చూశాం కాని భారత ప్రభుత్వం ఈ అంశంపై ఆసక్తి కనబరచడం లేదని అన్నారు. భారత వ్యవసాయ వ్యవస్థను ధ్వంసం చేసేందుకే మూడు వ్యవసాయ చట్టాలకు రూపకల్పన చేశారని రాహుల్ మండిపడ్డారు. ఈ చట్టాలు మన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి మొత్తం సేద్యం వ్యాపారాన్ని నరేంద్ర మోదీ స్నేహితులైన ఇద్దరి ముగ్గురి చేతిల్లో పెడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాలతో భారత వ్యవస్థాయ వ్యవస్థ ఇద్దరి ముగ్గురు చేతుల్లోకి వెళుతుందని అన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిని దోచి కొద్దిమంది సంపన్న స్నేహితుల జేబులు నింపడంలో బిజీగా ఉందని అంతకుముందు రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఎపిలో బిజెపి ఎదుగుదలకు కలసి రాని కాలం

పంచాయితీ ఎన్నికల్లో పట్టించుకోని ప్రజలు

గుదిబండగా మారిన అమరావతి, విశాఖ ఉక్కు, ప్రత్యేకహోదా

అమరావతి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఎపిలో ఎదగాలని కోరుకుంటున్న బిజెపికి అనూహ్యంగా ఎదురదెబ్బలు తగులుతున్నాయి. కొన్ను స్వయంకృతం కాగా..మరికొన్ని పార్టీ పరంగా, ప్రభుత్వపరంగా తీసుకుంటున్న నిర్ణయాలు దెబ్బకొడుతున్నాయి. తాజా పరిస్థితులు చూస్తుంటే ఎపిలో బిజెపి ఎదుగుదల అనుమానంగానే ఉంది. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు రానురాను బిజెపికి సంకటంగా మానరనున్నాయి. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ప్రత్యేకమోదా, అమరావతి నిర్మాణాల విషయంలో ఆ ఆపార్టీ అనుసరిస్తున్న తీరు పార్టీకి కక్కలేక మింగలేక అన్నట్లుగా తయారయ్యింది. తాజా పంచాయితీ ఎన్నికల ఫలితాల్లో ఇవి బాగా ప్రస్ఫుటిస్తున్నాయి. దేశంలో ముఖ్యంగా దక్షిణాదిలో వసి÷-తరించాలనుకుంటున్న కమలదళానికి క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో గమనించలేని స్థితలో ఉంది. రాష్ట్రంలో గత ఎన్నికల్లో ఒక్క శాతం కూడా ఓట్లు సాధించలేని బీజేపీ.. తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో దారుణ పరాజయం మూట గట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు నమోదైన పార్టీగా గుర్తింపు పొందిన బీజేపీ.. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో చట్టసభల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోగలిగింది. కానీ ఏపీ నుంచి లోక్‌సభలో గానీ, అసెంబ్లీలో గానీ ప్రాతినిధ్యం వహించే వారు లేకపోవడం పార్టీ దుస్థితికి అద్దం పడుతోంది. అదేమంటే.. ఒక్క సీటు కూడా లేని త్రిపురలో ఏకంగా అధికారాన్నే కైవసం చేసుకున్నామని.. ఇక్కడా అలాగే జరుగుతుందని రాష్ట్ర నేతలు సెలవిస్తూ వచ్చారు. 2019 సార్వత్రిక ఫలితాల తర్వాత బీజేపీకి మరోమారు కేంద్రంలో అధికారంలో రావడంతో ఇక తిరుగులేదని భావిస్తోంది. 2014 ఎన్నికల ప్రచారంలో ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బీజేపీ తర్వాత మాట మార్చడం, రైల్వే జోన్‌పై తాత్సారం, వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ఇచ్చిన నిధులు వెనక్కి తీసుకోవడం లాంటి వాటితో రాష్ట్ర ప్రజలు ఆ పార్టీకి షాకిచ్చారు. రాష్ట్రాన్ని విభజించిన తరవాత కాంగ్రెస్‌పై ఆగ్రహంతో ఉన్న ప్రజలు ఆ పార్టీకి సున్నా చుట్టారు. ఇప్పుడు బీజేపీయే ఎక్కువగా వెన్నుపోటు పొడిచిందని క

పథకం ప్రకారమే వామన్‌రావు దంపతుల హత్య

రిమాండ్ రిపోర్టులో పేర్కొన్న పోలీసులు

పెద్దపల్లి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): హైకోర్టు న్యాయవాది వామన్‌రావు దంపతుల హత్య కేసు రాష్ట్ర వ్యాప్తంగా అలజడి సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. కుంట శీను, చిరంజీవి ఇద్దరూ పథకం ప్రకారమే న్యాయవాద దంపతులను హతమార్చినట్టు తెలుస్తోంది. హత్య చేసిన తర్వాత నిందితులు రామగిరి నుంచి మహారాష్ట్రకు పరారయినట్లు పోలీసులు గుర్తించారు. ఆ తర్వాత సుందిళ్ల బ్యారేజ్‌లో కత్తులు, బట్టలు పడేసినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అనంతరం సుందిళ్ల బ్యారేజ్ దగ్గరే వేరే బట్టలు మార్చుకుని పరారయ్యారని పోలీసులు తెలిపారు. న్యాయవాది వామన్‌రావుకు సంబంధించిన సమాచారాన్ని లచ్చయ్య ఎప్పటికప్పుడు కుంట శీనుకు అందించేవాడని తెలిసింది. హత్యకు వినియోగించిన కత్తులు, వాహనం బిట్టు శీను సమకూర్చాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ కేసులో ఇప్పటివరకు ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు పేర్కొన్న పోలీసులు.. మరో ఇద్దరు నిందితులు కుంట శ్రీను, లచ్చయ్య పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పలువురు నామినేషన్

గుంటూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): కృష్ణా - గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన ప్రియదర్శిని విద్యా సంస్థల ఛైర్మన్ చందు రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా మంత్రి అవంతి శ్రీనివాస్ సోదరి చందు విజయలక్ష్మి, మోహన సాయి కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడి ప్రతాప్ రెడ్డి భార్య కల్పలతారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

టిడిపి అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేశారు: రాధాకృష్ణ

ఏలూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): టీడీపీ అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేసి దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ఏలూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ రాధాకృష్ణ విమర్శలు గుప్పించారు. తమ అభ్యర్థులను బెదిరించి గెలవాలనుకుంటే అధికార పార్టీ ఓటమిని అంగీకరించినట్లే అని అన్నారు. ఏలూరులో ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలపకుండా, పాత 50 డివిజన్లలో కలిపారని మండిపడ్డారు. నేరుగా కలపడం వల్ల కొన్ని సామాజిక వర్గాలు రిజర్వేషన్లు కోల్పోయారని రాధాకృష్ణ తెలిపారు

వాలంటీర్ వ్యవస్థతో వైకాపా రాజీకాయలు: జెసి

అనంతపురం,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో వాలంటీర్ల వ్యవస్థను వెంటనే తీసేయాలని టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం పర్యటనకు వచ్చిన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వాలంటీర్ వ్యవస్థ ప్రభుత్వానికి ప్రజలకు వారధి కాకుండా ఎన్నికల్లో ఓట్లు వేయించేందుకు పూర్తి స్థాయిలో పని చేస్తున్నారని విమర్శించారు. ఆ వ్యవస్థను వెంటనే తీసేయాలని డిమాండ్ చేశారు. కుప్పంలో కూడా ఎవరిని నామినేషన్లు వేయకుండా అధికార పార్టీ పూర్తిగా భయభ్రాంతులకు గురి చేసి ఏకపక్షంగా గెలిచామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న నాయకులు అంతా కలిసికట్టుగా పనిచేస్తే వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు కైవసం చేసుకుంటామని ప్రభాకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

జనసేనను ఆదరించి ప్రజల పక్షాన నిలిపారు: నాదెండ్ల మనోహర్

రాజమండ్రి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): పంచాయతీల ఎన్నికల్లో తూర్పుగోదావరి జిల్లా వాసులు జనసేనకు గొప్ప తీర్పును ఇచ్చారని ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ నిజాయితీగా ప్రజల కోసం...ప్రజల సమస్యల పైన పోరాడే జన సైనికులు విజయం సాధించారని తెలిపారు. రాజకీయ ప్రస్థానంలో రాబోయే రోజుల్లో జనసేన నిలబడడం కోసం.. మరింత ముందుకు వెళ్తుందని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీల ఎన్నికల్లో అనేక కుట్రలు పన్నిందని మండిపడ్డారు. ప్రలోభాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీ చేస్తామని స్పష్టం చేశారు. స్టీల్ ప్లాంట్ విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ రాజకీయ డ్రామాలాడుతుందని విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీలు స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్దిపొందేందుకే వైఎస్సార్ కాంగ్రెస్ నేతలు స్టీల్ ఎ÷-లాంట్‌పై ఉద్యమం చేస్తున్నారని విమర్శించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకునేందుకు కేంద్ర మంత్రులతో చర్చిస్తున్నారని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ఎ÷-లాంట్ ప్రైవేటీకరణ జరగదని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం

-డిజిపి గౌతం సవాంగ్ వెల్లడి

విజయవాడ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ తెలిపారు. ఈ మేరకు జిల్లాల యంత్రాంగానికీ ఆదేశాలు జారీ చేశామన్నారు. అంతేకాకుండా ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు కూడా సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. అయితే దీనికి సంబంధించిన అంశాలు కోర్టు పరిధిలో ఉన్నట్లు వివరించారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ సమావేశంలో పురపాలక ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించినందుకు ఎస్ఈసీ అభినందించారన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న పోలీసులకు కరోనా సోకినట్లు ఎలాంటి నివేదికలు లేవని చెప్పారు. అవసరమైతే సిబ్బందికి వ్యాక్సిన్ వేయిస్తామన్నారు. ఇప్పటికే పంచాయితీ ఎన్నికలను సజావుగా నిర్వహించామని అన్నారు.

పంచాయతీ ఓట్ల లెక్కింపులో అవకతవకలు

గండిగుండం సర్పంచ్ అభ్యర్థి రమేశ్ ఆందోళన

విశాఖపట్టణం,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): పంచాయతీ ఓట్ల లెక్కింపులో అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ విశాఖ జిల్లా ఆనందపురం మండలం గండిగుండం సర్పంచ్ అభ్యర్థి రమేశ్ ఆందోళనకు దిగారు. జిల్లా కలెక్టరేట్ ఎదుట 700 మంది మద్దతుదారులతో నిరసన చేపట్టారు. విశాఖపట్నం రెవెన్యూ డివిజన్‌లోని 130 గ్రామపంచాయతీలకు ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. అయితే గండిగండం పంచాయతీ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఓ వర్గం అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. తొలుత రమేశ్ విజయం సాధించారని ప్రకటించి, మళ్లీ రీకౌంటింగ్ నిర్వహించారని, అనంతరం ప్రత్యర్థి విజయం సాధించినట్లు ధ్రువీకరించారని చెబుతున్నారు. కలెక్టర్ చొరవ తీసుకొని మళ్లీ పోలింగ్ నిర్వహించేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తెలంగాణ కాంగ్రెస్‌కు మరోషాక్

-అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి రాజీనామా

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): తెలంగాణ కాంగ్రెస్‌కు మరోషాక్ తగిలింది. కాంగ్రెస్ పార్టీకి అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ నియోజకవర్గం నుంచి రాములు నాయక్‌ను, హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ స్థానానికి చిన్నారెడ్డిని అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ స్థానం నుంచి పోటీ చేయాలని హర్షవర్ధన్‌రెడ్డి అనుకున్నారు. అయితే అధిష్ఠానం చిన్నారెడ్డికి గ్రీన్ సిగ్నలిచ్చింది. దీంతో హైదరాబాద్ స్థానంపై ఆశలు పెట్టుకున్న హర్షవర్ధన్‌రెడ్డి రెబెల్‌గా బరిలోకి దిగేందుకు ప్రయత్నాల్లో ఉన్నారు. ఇటీవల హర్షవర్ధన్‌రెడ్డిని పిలిపించుకున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అవకాశం ఇస్తామని, ఇప్పుడు రెబెల్‌గా పోటీకి దిగవద్దని బుజ్జగించినట్లు సమాచారం.

పట్టభద్ర ఎన్నికల్లో ప్రేమేందర్ రెడ్డిని గెలిపించండి

-మేధావి వర్గానికి బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు

నల్లగొండ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): పట్టభద్ర మేధావి వర్గం బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని ఆశీర్వదించాలని... ఆలోచించి ఓటు వేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ కోరారు. ప్రేమ్‌ను ఎమ్మెల్సీగా గెలిపించి ప్రజల పక్షాన గొంతుకగా నిలపాలన్నారు. లెక్చరేట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన, గడీల పాలన కొనసాగుతోందని విమర్శించారు. నీచ రాజకీయాలకు సమాధి కట్టాలన్న టీఆర్ఎస్ పార్టీ మెడలు వంచాలన్నా దమ్మున్న బీజేపీని గెలిపించాలని వినతి చేశారు. అమరవీరుల రక్తపు మడుగులో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం ప్రగతి భవన్‌కు పరిమితం అయ్యారని మండిపడ్డారు. ఉపాధ్యాయులను మోసం చేసిందీ ప్రభుత్వమని.. వారి కోసం జైలుకెళ్లిన బీజేపీని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే పీఆర్సీ వస్తుందని తెలిపారు.

ఉద్యమాల పురిటిగడ్డగా నిలిచిన నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల్లో పట్టభద్రులు ఆలోచించాలని అన్నారు. జీహెచ్ఎంసీలో బీజేపీని గెలిపిస్తే ఎల్ఆర్ఎన్ పారిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే నోటిఫికేషన్, పీఆర్సీ వస్తాయని, సీఎం బయటకు వస్తారని తెలిపారు. పల్లాను గెలిపిస్తే సీఎం ఫామ్ హౌస్‌కు వెళ్లి గ్లాస్‌లో సోడా పోశారని దుయ్యబట్టారు. టీఆర్ఎస్ వారు ఓడగొడుతారన్న పల్లాకే మళ్లీ టికెట్ ఇచ్చారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్ పార్టీ మెడలు వంచాలన్నా దమ్మున్న బీజేపీని గెలిపించాలని వినతి చేశారు. అమరవీరుల రక్తపు మడుగులో అధికారంలోకి వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం ప్రగతి భవన్‌కు పరిమితం అయ్యారని మండిపడ్డారు. ఉపాధ్యాయులను మోసం చేసిందీ ప్రభుత్వమని.. వారి కోసం జైలుకెళ్లిన బీజేపీని ఈ ఎన్నికల్లో గెలిపిస్తే పీఆర్సీ వస్తుందని తెలిపారు. ఉద్యమాల పురిటిగడ్డగా నిలిచిన నల్గొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల్లో పట్టభద్రులు ఆలోచించాలని అన్నారు. జీహెచ్ఎంసీలో బీజేపీని గెలిపిస్తే ఎల్ఆర్ఎన్ పారిపోయిందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే నోటిఫికేషన్, పీఆర్సీ వస్తాయని, సీఎం బయటకు వస్తారని తెలిపారు.

పంచాయితీ ఎన్నికల్లో మంచి ఫలితాలు

మంత్రి పెద్దిరెడ్డిని అభినందించిన సిఎం జగన్
చంద్రబాబు పని అయిపోయిందన్న మంత్రులు

అమరావతి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో గెలుపొందడంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సీఎం వైఎస్ జగన్ అభినందించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన కృష్ణా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల భేటీ జరిగింది. మున్సిపల్ ఎన్నికలపై మంత్రి పెద్దిరెడ్డి దిశానిర్దేశం చేశారు.

అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ప్రభంజనం సృష్టించారన్నారు. సీఎం వైఎస్ జగన్ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఏదో సాధించాలని చతికిలపడ్డారు. టీడీపీ పునాదులు కదులుతున్నా అసత్య కథనాలు రాయిస్తున్నారు. 80.37 శాతం పంచాయతీలను వైఎస్సార్ సీపీ మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్నికలు సజావుగా జరిగితే 90 శాతానికి పైగా గెలిచేవాళ్లం.

సీఎం జగన్ సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారు. ప్రజాస్వామ్యానికి అద్దం పట్టేలా ఫలితాలు వచ్చాయి. కుప్పం ఫలితాలే చంద్రబాబు పై వ్యతిరేకతకు నిదర్శనం. మున్సిపల్ ఎన్నికల్లో ఇంతకంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని మంత్రి పెద్దిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో 42 శాతం గెలుపు ఎక్కడ వచ్చిందో చంద్రబాబు చెప్పాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని ప్రశ్నించారు. చంద్రబాబుకు పిచ్చెక్కి మాట్లాడుతు న్నారని, గెలిచిన 42 శాతం అభ్యర్థులు ఎవరో ప్రకటించాలని సవాల్ చేశారు.

ఆయన్ని టీడీపీ నేతలు ఎర్రగడ్డ మెంటల్ ఆస్పత్రికి పంపడం ఖాయమని మంత్రి ఎద్దేవా చేశారు.

సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మా నాయకుడు సీఎం వైఎస్ జగన్ చంద్రబాబుకు కుప్పంలో కూడా చుక్కలు చూపించారు.

కుప్పంలోనే మేము 75 స్థానాలు గెలిస్తే ఇక బాబు ఎక్కడ 42 శాతం గెలిచినట్టు. చంద్రబాబు పిచ్చి ప్రేలాపణలు మానుకోవాలి. ఆయన జూమ్‌యాప్‌లో కూర్చుని పగటి కలలు కంటున్నారు.

టీడీపీ తమ్ముళ్లకు నాదో సలహా.. బాబు పిచ్చితో తెలంగాణాలో పార్టీని భూస్థాపితం చేశారు. ఇప్పటికైనా ఆయన్ని తమ్ముళ్లు పిచ్చాసుపత్రిలో చేర్చాలి. లేదంటే ఏపీలో కూడా పార్టీ భూస్థాపితమే అవుతుంది. గుర్తులేని పంచాయతీ ఎన్నికల్లోనే ప్రజలు సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. ఇక పార్టీ గుర్తుతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో విజయం మాదే. రాష్ట్రంలోఎన్నికలు జరిగే అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కైవసం చేసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

ప్రతి కార్యకర్తకు బీమా చేసిన ఏకైకపార్టీ టీఆర్ఎస్: మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): రాయపర్తి మండలం ఆరెగూడెం కి చెందిన 30 మంది కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు ఆ పార్టీ కి రాజీనామా చేసి, టీఆర్ఎస్ పార్టీలో చేరారు. హన్మకొండలోని క్యాంప్ కార్యాలయం అర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో వాళ్లకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గులాబీ కండువాలు కప్పి వారిని టీఆరెఎస్ లోకి ఆహ్వానించారు. ఈ సదర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ, దేశంలో 60లక్షల సభ్యత్వం ఆన్ లైన్ చేసిన ఏకైక పార్టీ టీఆరెఎస్ అని అన్నారు. పార్టీ లోని ప్రతి సభ్యుడికి భీమా చేసిన ఘనత కూడా టీఆర్ఎస్ కే దక్కుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి సభ్యుడికి సముచిత గౌరవం దక్కుతుందని చెప్పారు. టీఆర్ఎస్ లో చేరిన వారిలో యార మహేందర్, యారా ఉపేందర్, అనుమల యాకయ్య, యారా సుధాకర్, యారా నాగయ్య, యారా కరుణాకర్,అనుమల పెద్ద యాకయ్య, పెండ్లి మల్లేష్, ముస్కు రాంరెడ్డి, ముస్కు ప్రదీప్, యారా సంపత్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిళ్ల సుధీర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మూనవత్ నర్సింహ నాయక్, జడ్పిటిసి రంగు కుమార్, ఆరె గూడెం సర్పంచ్ పెండ్లి రజిని సుధాకర్, పార్టీ సీనియర్ నాయకులు మల్లకారి మధు, టీఆర్ఎస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు నర్మద తదితరులు పాల్గొన్నారు.

ఇంతగా ప్రజలను వేధించే ప్రభుత్వాన్ని చూడలేదు

ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే వైకాపా పతనం ప్రారంభమైంది
ప్రజాస్వామ్య పరిరక్షణకు తెదేపా వీరోచితంగా పోరాడింది
-మీడియా సమావేశంలో టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): వైకాపా పతనం ప్రారంభమైనట్లు తెలుస్తోందని, దీనిని ఎవరూ కాపాడలేరని అన్నారు. వైకాపా నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, అరాచకాలు సృష్టించారని విమర్శించారు. మంగళగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాస్వామ్య పరిరక్షణకు తెదేపా వీరోచితంగా పోరాడిందన్నారు. విపరీతంగా ధరలు పెంచి పన్నుల భారం మోపారని అన్నారు. 4వ విడతలో 41.7 శాతం సర్పంచ్ స్థానాలు గెలుచుకున్నాం. మొత్తం నాలుగు విడతల్లో కలిపి 4,230 సర్పంచ్ స్థానాలను గెలిచాం. సక్రమంగా జరిగి ఉంటే మరో 10 శాతం స్థానాల్లో విజయం సాధ్యమయ్యేది. అధికార దుర్వినియోగం, ఫలితాల తారుమారుపై వైకాపా ఆధారపడింది. కేవలం రెండేళ్లకే మిడిసిపడుతున్నారు.. 22 ఏళ్లు తెదేపా అధికారంలో ఉందని గుర్తుంచుకోవాలని చంద్రబాబు అన్నారు. అధికారాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలో ఎస్ఈసీ విఫలమైందన్నారు. సక్రమంగా నిర్వహించామని ఎన్నికల సంఘం ఎలా చెప్పగలదని ప్రశ్నించారు.

ఇదిలావుంటే పంచాయతీ ఎన్నికల నాలుగో దశలో గెలిచిన వైసీపీయేతర అభ్యర్థులను ప్రకటించకుండా ఫలితాలు తారుమారు చేస్తున్నారని రాష్ట్ర ఎన్నికల సంఘానికి టీడీపీ అధినేత చంద్రబాబు ఫిర్యాదు చేశారు. రాత్రి 10గంటలకూ 40శాతం ఫలితాలు ప్రకటించలేదన్నారు. టీడీపీ మద్దతు అభ్యర్థులకు మూడంకెల మెజారిటీ ఉన్నా రీకౌంటింగ్ చేశారని, వైసీపీ నేతలతో పోలీసులు, అధికారులు కుమ్మక్కై, ఫలితాలపై ప్రభావం చూపారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫలితాల ప్రకటనలో జాప్యం, అధికారుల అన్యాయాలు, వైసీపీ అక్రమాలపై ఆదివారం రాత్రి ఎస్ఈసీకి చంద్రబాబు రెండు లేఖలు రాశారు. ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. 'స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అక్రమాలపై ఎన్నికల సంఘానికి అనేక ఫిర్యాదులు చేశాం. అయినా అక్రమాలపై, రాజ్యాంగ ఉల్లంఘనలపై ఎలాంటి చర్యలు లేవు. 4వ దశ ఎన్నికల్లో కూడా ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచినా, ఫలితాలు దాచి, రాత్రి 8గంటల తర్వాత వైసీపీ బలపర్చినవారికి అనుకూలంగా ప్రకటనలు వెలువరిస్తున్నారు. గత 3దశలతో పాటు 4వ విడతలోనూ అలాంటి ఘటనలే వెలుగుచూశాయి. చీకటి పడిన తర్వాత ఫలితాల తారుమారులో పోలీసులు, ఎన్నికల విధుల్లోని అధికారులు వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజల తరఫున ఈ అక్రమాలను మరోసారి మీ దృష్టికి తెస్తున్నాం' అని ఆయన పేర్కొన్నారు. 'ఎన్నికల నియమావళి ప్రకారం కౌంటింగ్ కేంద్రాల్లో జరగాల్సిన వీడియో రికార్డింగ్ పక్రియ ఎక్కడా జరగలేదు. చీకటి పడ్డాక అనేకచోట్ల లైట్లు ఆపేసి, ఫలితాలు తారుమారు చేశారు. సింగిల్ డిజిట్ మెజారిటీ ఫలితాలు వచ్చినప్పుడు మాత్రమే రీకౌంటింగ్ చేయాల్సి ఉన్నా, వైసీపీ గెలుపు కోసం రెండు, మూడంకెల తేడా ఉన్నా చేస్తున్నారు. ప్రతిపక్షాలు బలపర్చిన అభ్యర్థుల గెలుపు ఖాయమైనా, ఫలితాలు దాచిపెట్టి, తర్వాత వైసీపీ అభ్యర్థులు గెలిచినట్లు ప్రకటిస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు.

శ్రీనివాస్ గౌడ్‌ను పరామర్శించిన మంత్రి కొప్పుల

మహబూబ్‌నగర్ : మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను సహచర మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. శ్రీనివాస్ గౌడ్ తండ్రి నారాయణ గౌడ్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మహబూబ్‌నగర్ పట్టణ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో శ్రీనివాస్ గౌడ్ తండ్రి సమాధిని ఆయన సందర్శించారు. నారాయణ గౌడ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. నారాయణ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థించారు. తండ్రి మరణంతో తీవ్ర విచారంలో ఉన్న శ్రీనివాస్ గౌడ్‌ను మంత్రి కొప్పుల ఓదార్చారు. కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత కాని, జెడ్పీ చైర్మన్ పుట్టా మధుకర్ ఉన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు పోలీస్‌శాఖ సిద్ధం : డీజీపీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 22: మున్సిపల్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూసేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఏపీ డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. ఆదివారం నాలుగో విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా విశాఖ జిల్లాలోని పెందుర్తి విజయనగరంలోని కొత్తపలస మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఓటర్లను వివరాలు అడిగి తెలుసుకొని ఓటింగ్ సరళిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ఈ ఎన్నికలను సైతం ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లో ఒకట్రెండు చోట్ల మినహా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది పటిష్ఠ చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎక్కడ ఏ చిన్నఘటన జరిగినా సకాలంలో స్పందించి పోలింగ్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా చూశారని, సమస్యలను వృత్తినిబద్ధతతో పరిష్కరించారని పోలీసులను అభినందించారు. ఏపీలోని 12 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలకు వచ్చే నెల 10న ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

వాహనం బోల్తా: ఇద్దరు మృతి

జనగామ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. టాటా ఏస్ వాహనం బోల్తా పడటంతో ఇద్దరు మృతి చెందారు. ఈ విషాద ఘటన బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టాటా ఏస్ వాహనం బోల్తా పడటంతో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతులు సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన బుడిగి మల్లయ్య, జనగామకు చెందిన చెన్నమ్మగా గుర్తించారు. సంఘటన స్థలానికి చేరుకున్న బచ్చన్నపేట ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

విమర్శలు మానకుంటే బుద్ధి చెబుతాం: మంత్రి ప్రశాంత్‌రెడ్డి

కామారెడ్డి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్‌పై విమర్శలు చేస్తే తరిమి కొడతామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు.

సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన సవాల్‌కు బీజేపీ నేత బండి సంజయ్ జవాబు చెప్పకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. అమలవుతున్నట్లు నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని మంత్రి ప్రకటించారు. నిరూపించలేకపోతే తన పదవికి బండి సంజయ్ రాజీనామా చేస్తారా అని ప్రశాంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

వామన్‌రావు దంపతుల హత్యకు శ్రీధర్ బాబే కారణమట

పెద్దపల్లి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): గట్టు వామన్ రావు దంపతుల హత్యకు శ్రీధర్ బాబే కారణమని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మంద నగేష్ ముదిరాజ్ అన్నారు. మంథనిలో ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. న్యాయవాద దంపతులను అక్రమాలకు, అరాచకాలకు ప్రోత్సహించింది మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబేనని నగేష్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శవాల మీద పేలాలు ఏరుతున్నాడని ఘాటుగా విమర్శించారు. కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగడు అనే విధంగా బీజేపీ నాయకుల తీరు ఉందని ఎద్దేవా చేశారు. హత్యలు జరగడం విచారకరం

బాలయ్య చిత్ర షూటింగ్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

'సింహా', 'లెజెండ్' విజయాల తర్వాత బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'గాడ్‌ఫాదర్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. కథకు సరిపోయేలా పలు శక్తివంతమైన టైటిల్స్‌ను పరిశీలించిన చిత్రబృందం చివరకు ఈ పేరును నిర్ణయించినట్లు తెలిసింది. ప్రగ్యా జైస్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం మే 28న ప్రేక్షకుల ముందుకురానున్నది. మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. థమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. అయితే ఈ చిత్ర షూటింగ్ వికారాబాద్ మండలం కొటాల గూడెంలో

జరిపేందుకు చిత్ర బృందం వెళ్ళింది. వారిని గ్రామస్తులు అడ్డుకున్నారు. షూటింగ్ వలన పంట పొలాలు పాడవుతాయని ఇక్కడ షూటింగ్ చేయవద్దని కొటాలగూడ గ్రామస్తులు వాపోయారు. దీంతో బాలయ్య మూవీ యూనిట్ మరో లొకేషన్ వెతికే పనిలో పడిందట. ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందరెడ్డి దీనిని నిర్మిస్తున్నారు. ప్రగ్యా జైస్వాల్ కథానాయిక. తమన్ దీనికి సంగీత స్వరాలు సమకూరు స్తున్నారు. ఈ సినిమా షూటింగ్ దశలో ఉండగానే ప్రీ రిలీజ్ బిజినెస్ ఓ రేజ్ లో జరుగుతుందట. ఆంధ్ర థియేట్రికల్ హక్కులు రూ.35 కోట్లకు అమ్ముడయ్యాయని వార్తలు వినిపిస్తున్న తరుణంలో.. నైజాం, ఉత్తరాంధ్ర హక్కులను రూ.16 కోట్ల రూపాయలకు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు దక్కించుకున్నారని తెలుస్తోంది. ఈ సినిమా మే 28న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

గర్భవతి రోల్‌లో ఛాలెంజింగ్‌గా అనసూయ

బుల్లితెర గ్లామర్ క్వీన్ అనసూయ ఇటు టీవీ షోస్‌తో అటు సినిమాలతోను ప్రేక్షకులను ఫుల్ ఎంటర్‌టైన్ చేస్తున్న సంగతి తెలిసిందే. సినిమాల విషయానికి వస్తే అనసూయ ప్రధాన పాత్రలో తెరకెక్కిన థ్యాంక్యూ బ్రదర్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో గర్భవతిగా ఛాలెంజింగ్ రోల్ పోషించింది. ఇక రంగమార్తాండ, ఖిలాడి, పక్కా కమర్షియల్, పుష్ప వంటి చిత్రాలలో స్పెషల్ క్యారెక్టర్స్‌లో కనిపించి సందడి చేయనుంది అనసూయ. ఇక కార్తికేయ, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలలో తెరకెక్కిన చావు కబురు చల్లగా చిత్రంలో అనసూయ మాస్ నెంబర్ వేసిందని ఇటీవల మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలలోనే కాక మరికొన్ని సినిమాలలోను అనసూయ స్పెషల్ సాంగ్స్ చేయనుందనే వార్తలు గుప్పుమన్నాయి. దీనిపై స్పందించిన అనసూయ.. ఎలాంటి స్పెషల్ సాంగ్స్ చేయడం లేదు. చావు కబురు చల్లగా చిత్రంలోని పాటను నా ఫ్రెండ్ జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేయడంతో స్పెషల్ సాంగ్ చేసేందుకు ఆసక్తి చూపాను. వెండితెరపై అద్భుతమైన పాత్రలు చేయాలనేది నాకల అంటూ అనసూయ పేర్కొంది.

శరవేగంగా అయ్యప్పన్ కోషియమ్ రీమేక్ షూటింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దాదాపు రెండేళ్ల తర్వాత మేకప్ వేసుకున్న సంగతి తెలిసిందే. వకీల్ సాబ్ చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టిన పవన్ ఏప్రిల్ 9న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నాడు. ఇక ప్రస్తుతం అయ్యప్పన్ కోషియమ్ రీమేక్ చిత్రంతో పాటు క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ మూవీగా బిజీగా ఉన్నాడు. అయ్యప్పన్ కోషియమ్ చిత్రం రీమేక్‌పై పవన్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు సమాచారం. నటుడిగానే కాదు ఒక్కోసారి దర్శకుడిగాను మారుతూ ఉంటాడు పవన్ కళ్యాణ్. ప్రస్తుతం అయ్యప్పన్ కోషియమ్ రీమేక్ చిత్రాన్ని సాగర్ కె చంద్ర తెరకెక్కిస్తుండగా, త్రివిక్రమ్ మాటలు అందిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఓ సీన్‌లో పవన్ కళ్యాణ్‌ను రానా గట్టిగా దబాయించాల్సి ఉంటుందట. ఆ సన్నివేశాన్ని రానా సరిగా చేయలేదని భావించిన పవన్ అతని దగ్గరకు వెళ్లి.. ఇక్కడ నేను డౌన్ అవ్వాలి.. నువ్వు హై అవ్వాలి. ఇంకాస్త గట్టిగా దబాయించు అని అతనితో చెప్పాడట. రెండో టేక్‌కు ఆ సీన్‌ను పవన్ ఓకే చేయడంతో తర్వాతి సీన్‌కు వెళ్ళాటరట. ఈ సినిమాపై పవన్ చాలా శ్రద్ధ చూపిస్తున్నారని తెలుస్తోంది.

రైతుల సమస్యలపై ప్రపంచం స్పందిస్తోంది

అయినా పట్టించుకోని ప్రధాని మోడీ: రాహుల్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): వ్యవసాయ చట్టాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బీజేపీ సర్కార్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. రెండునెలలకు పైగా రైతులు దేశ రాజధాని ప్రాంతంలో నిరసనలు చేపడుతున్నా అన్నదాతల గోడును కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ పేర్కొన్నారు. కేరళలోని వయనాడ్‌లో ట్రాక్టర్ ర్యాలీ ముగింపు సందర్భంగా సోమవారం ముల్లిలో రైతులను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. మన రైతుల ఇక్కట్లను యావత్ ప్రపంచం చూసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం రైతుల గోడును ఆలకించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల దుస్థితిపై పాప్ స్టార్‌లు మాట్లాడటం చూశాం కాని భారత ప్రభుత్వం ఈ అంశంపై ఆసక్తి కనబరచడం లేదని అన్నారు. భారత వ్యవసాయ వ్యవస్థను ధ్వంసం చేసేందుకే మూడు వ్యవసాయ చట్టాలకు రూపకల్పన చేశారని రాహుల్ మండిపడ్డారు. ఈ చట్టాలు మన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి మొత్తం సేద్యం వ్యాపారాన్ని నరేంద్ర మోదీ స్నేహితులైన ఇద్దరి ముగ్గురి చేతిల్లో పెడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాలతో భారత వ్యవస్థాయ వ్యవస్థ ఇద్దరి ముగ్గురు చేతుల్లోకి వెళుతుందని అన్నారు. ఇక కేంద్ర ప్రభుత్వం సామాన్యుడిని దోచి కొద్దిమంది సంపన్న స్నేహితుల జేబులు నింపడంలో బిజీగా ఉందని అంతకు ముందు రాహుల్ గాంధీ ఆరోపించారు.

ఉచిత ఫాస్టాగ్ ఇవ్వనున్న నేషనల్ హైవే

మార్చి 31 వరకు ఉచిత అవకాశం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): వచ్చే నెల 31 దాకా వెహికల్స్‌కు ఉచితంగా ఫాస్టాగ్ స్టికర్ ఇస్తామని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వెల్లడించింది. దేశమంతటా ఉన్న 770 టోల్‌ప్లాజాల్లో ఫ్రీ ఫాస్టాగ్ తీసుకోవచ్చు. ఫలితంగా వెహికిలిస్టులకు రూ.100 ఆదా అవుతుంది. మనదేశంలో ప్రస్తుతం 87 శాతం మంది వెహికిలిస్టులు ఫాస్టాగ్ ద్వారా టోల్‌ఫీజు చెల్లిస్తున్నారు. ఫాస్టాగ్ వాలెట్‌లో మినిమమ్ అమౌంట్‌ను మెయింటెయిన్ చేయాలనే రూల్‌ను ఎన్‌హెచ్ఏఐ తొలగించింది. ఎలక్ట్రానిక్ టోల్ ప్లాజాల వద్ద వెహికల్స్ కదలికలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. 'దేశంలో ఫాస్టాగ్ వాడకాన్ని మరింత పెంచేందుకు, టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ఫాస్టాగ్ వాలెట్ లేదా లింక్ బ్యాంక్ అకౌంట్లలో మినిమమ్ అమౌంట్‌ను తప్పనిసరిగా మెయింటెయిన్ చేయడాన్ని కూడా తొలగిస్తున్నాం' అని ఎన్‌హెచ్ఏఐ ఓ స్టేట్‌మెంట్‌లో పేర్కొంది. తాజా నిర్ణయంతో ఫాస్టాగ్ అకౌంట్ లేదా వాలెట్లలో యూజర్ల బ్యాలెన్స్ నెగిటివ్ కాకుండా ఉంటే చాలు, టోల్ ప్లాజాల నుంచి వెహికల్స్ పంపుతారు. ప్లాజాలను దాటాక యూజర్ల ఫాస్టాగ్ బ్యాలెన్స్ నెగిటివ్‌లోకి వెళితే మాత్రం, బ్యాంకులు వారి సెక్యూరిటీ డిపాజిట్ల నుంచి డబ్బులను కట్ చేసుకుంటాయి. దేశంలో 2.54 కోట్ల మంది ఫాస్టాగ్ యూజర్లున్నారు. ఈ నెల 15 నుంచి టోల్ ప్లాజాల దగ్గర చెల్లింపులను తప్పనిసరిగా ఫాస్టాగ్ ద్వారానే చేయాలి. లేకపోతే టోల్‌ఫీజుకు రెండింతలు వసూలు చేస్తారు.

రోటరీ క్లబ్బుల నిరంతర నిస్వార్థ సేవలు శ్లాఘనీయం..!

(23 ఫిబ్రవరి 'రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక దినం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా 200లకు పైగా దేశాల్లో సమాజంలో ఉన్నత స్థితుల్లో ఉన్న 12 లక్షల స్వచ్ఛంధ సేవకులతో కూడిన 35,000లకు మించిన రోటరీ క్లబ్బులతో సామాజిక సేవలను విస్తరిస్తూ, సమాజ సమస్యలకు పరిష్కారాలు చూపిస్తూ, స్థానిక అవసరాలకు గ్లోబల్ చేయూతను అందిస్తున్న 'రోటరీ ఇంటర్నేషనల్' సేవా సంస్థను 23 ఫిబ్రవరి 1905న చికాగోలో పాల్ హారిస్ ప్రారంభించారు. కుల మత రాజకీయ ప్రాంతాలకు అతీతంగా మానవీయ కోణంలో సేవలందించే రోటరీ క్లబ్బుల నినాదం 'సర్వ్ ఎబో సెల్ఫ్ (స్వార్థం వీడి సేవలు)'తో విశ్వవ్యాప్తంగా ఏడాదికి 16 మిలియన్ల సేవా గంటలు అవసరార్థులకు నిస్వార్థంగా మరియు స్వచ్ఛంధంగా అందిస్తున్నది. గత 115 సంవత్సరాలుగా పేదరికం, నిరక్షరాస్యత, నీటి కొరత, అనారోగ్యాలు, అపరిశుభ్రతలపై తమదైన శైలిలో పోరాడుతూ దేశభక్తిని మరియు మానవీయతను చాటుకుంటున్నారు. అమెరికాలోకి ఇల్లినోయిస్ కేంద్రంగా పనిచేస్తున్న రోటరీ ఇంటర్నేషనల్ అవిశ్రాంత కృషిలో భాగంగా ఇప్పటి వరకు 2.5 బిలియన్ల పిల్లలకు పోలియో టీకాలు అందించడంలో సఫలమైంది. అంతర్జాతీయ స్థాయిలో సాంస్కృతిక అవగాహనలు, యువతకు అవసర శిక్షణలు, శరణార్థుల సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రపంచశాంతి సాధనకు అవిరళ కృషి జరుగుతోంది. అన్ని వర్గాల ప్రజలకు స్వచ్ఛ నీరు, పరిసరాల మరియు వ్యక్తిగత పరిశుభ్రత, విద్య, వైద్యం మరియు ఆర్థిక అవకాశాల కల్పనలో రోటరీ అనునిత్యం నిమగ్నమై ఉంది. లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు అవసరమైన బాలికల విద్య, వియోజన విద్య అందించడమే లక్ష్యంగా రోటరీ ముందుకు సాగుతున్నది. అందరికీ ఉద్యోగ ఉపాధుల్లో సమన్యాయం కల్పిస్తూ, సహజవనరుల దిర్వినియోగాన్ని వ్యతిరేకిస్తూ, మతసామరస్య మరియు అంతర్జాతీయ సమైక్యత స్థాపనకు మరియు పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్నది.

రోటరీ క్లబ్ సభ్యులను 'రొటేరియన్' అని మరియు సభ్యుడి సతీమణిని 'రోటరీ అన్నీస్' అని పిలుస్తారు. రొటేరియన్ల భార్య పిల్లల్ని రోటరీలో ఏకం చేస్తూ 1924లో 'ఇన్నర్ వీల్' అంతర్జాతీయ సంస్థను స్థాపించారు. అంతర్జాతీయ స్థాయిలో పోలియోను నిర్మూలించే కృషిలో భాగంగా రోటరీ ఇంటర్నేషనల్ అందిస్తున్న అపూర్వ 'పల్స్ పోలియో' టీకా చుక్కలు వేసే కార్యక్రమానికి భారత్ లాంటి దేశాల్లో ఎంతో ఆదరణ ఉంది. 14 నుండి 30 ఏండ్ల వయసున్న యువతలో నాయకత్వ లక్షణాలు, పౌర బాధ్యతలు, వ్యక్తిగత మరియు వృత్తి నైపుణ్యాలు పెంపొందించే నిమిత్తం 'రోటరీ యూత్ లీడర్‌షిప్ అవార్డులు' కార్యక్రమాలను తీసుకోవడం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 78 దేశాల్లోని 6,800 ప్రజా సంఘాలకు చెందిన 1,57,000 నాన్-రొటేరియన్ స్త్రీ పురుషులతో కూడిన 'రోటరీ కమ్యూనిటీ కోర్' ఏర్పాటు చేయడం జరిగింది. రోటరీ యూత్ ఎక్స్‌ఛేంజ్, రోటరీ పీస్ సెంటర్స్, లిటరసీ ప్రొగ్రామ్‌లు లాంటి కార్యక్రమాలు చేపట్టడం విశేషమైనవిగా చెప్పవచ్చు. ప్రగతి పథంలో పయనించాలని ఆశించే ఉద్దేశంతో చక్రం లేదా వీల్‌ను లోగోగా తీసుకొన్న రోటరీ ఇంటర్నేషనల్ నిరంతరం సేవా గంటలు అవసరార్థులకు నిస్వార్థంగా మరియు స్వచ్ఛంధంగా అందిస్తున్నది. స్నేహం, సోదరభావం మరియు సేవలను పెంపొందించే క్రమంలో రోటరీ బాధ్యతాయుతంగా సమాజహిత సేవలను అందిస్తున్నది.

ఇండియాలో ప్రథమ రోటరీ క్లబ్ కలకత్తాలో 01 జనవరి 1920న ప్రారంభించబడింది. నేడు దేశవ్యాప్తంగా 3,000 రోటరీ క్లబ్బులు మరియు 1,15,000 సభ్యులు స్వచ్ఛంధ సేవలను అందిస్తున్నారు. రోటరీ సభ్యత్వం పొందిన వారికి స్నేహం, సామాజిక సేవ, వినోదం, నాయకత్వం, వ్యాపారాభివృద్ధి, వ్యక్తిగత అభివృద్ధి, పర్యటించడం మరియు నిరంతర జ్ఞాన సమపార్జన లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రతి రొటేరియన్ వార్షిక సభ్యత్వంగా కనీసం రూ? 6,000/- చెల్లించాల్సి ఉంటుందని గమనించాలి. ప్రపంచవ్యాప్తంగా స్వచ్ఛంధ సేవలు అందించే అతి పెద్ద సంస్థలుగా రోటరీ ఇంటర్నేషనల్ మరియు లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్‌లు 24×7 సమాజహిత నిస్వార్థ సేవలు అందిస్తున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా స్థిరపడిన రోటరీ మరియు లయన్స్ క్లబ్బుల సభ్యులు తమ ధనాన్ని, విలువైన సమయాన్ని మరియు మేధస్సును పేదల ఉద్ధరణకు వెచ్చించడం ఎంతో ముదావహం. ఇలాంటి మానవీయ నిస్వార్థ స్వచ్ఛంధ సేవకులకు సమాజం సలాం చేస్తున్నది. వీరి స్ఫూర్తితో మనందరం సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

కొరోనిల్‌ను ఎలా ప్రమోట్ చేస్తారు : ఆరోగ్య మంత్రిపై ఐఎంఏ ఫైర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కొవిడ్-19 చికిత్సలో బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి అభివృద్ధి చేసిన కొరోనిల్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ తిరిగి ప్రోత్సహించడాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఖండించింది. భారత వైద్య మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి డ్రగ్‌ను ఏ డాక్టర్ ప్రమోట్ చేయరాదని స్పష్టంగా నిబంధనలున్నాయని, డాక్టర్ కూడా అయిన కేంద్ర ఆరోగ్య మంత్రి కొరోనిల్‌ను ఎలా ప్రోత్సహిస్తారని ఐఎంఏ విస్మయం వ్యక్తం చేసింది. కొరోనిల్‌పై పతంజలి పరిశోధనా కేంద్రం రూపొందించిన పరిశోధనా పత్రాన్ని ఆ సంస్థ సహవ్యవస్థాపకుడు రాందేవ్ శుక్రవారం విడుదల చేశారు.

ఈ పేపర్‌ను కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్, రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీల సమక్షంలో విడుదల చేయడం గమనార్హం. ఈ సందర్భంగా ఏర్పాటైన పోస్టర్‌పై కొరోనిల్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన గుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్ (జీఎంపీ0 సర్టిఫై చేసినట్టు ఉదహరించారు. అయితే కొవిడ్-19 ట్రీట్‌మెంట్‌లో తాము ఏ సంప్రదాయ ఔషధాన్ని పరిశీలించి సర్టిఫై చేయలేదని డబ్ల్యూహెచ్ఓ ఆ తర్వాత ట్వీట్ చేసింది. కేంద్ర ఆరోగ్య మంత్రి సమక్షంలో అశాస్త్రీయ ఔషధాన్ని తప్పుడు పద్ధతిలో ప్రమోట్ చేసుకోవడం సరైంది కాదని ఐఎంఏ పతంజలికి చెంపపెట్టు వంటిదని, ఇది యావత్ దేశానికి అవమానకరమని ఆక్షేపించింది. డబ్ల్యూహెచ్ఓ ప్రకటన పేర్కొంది.

హైకోర్టు న్యాయవాదులను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

- సమాచార హక్కు సంఘం ఆలిండియా జాయింట్ సెక్రటరీ జువ్వాడి ఆంజనేయులు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి):పెద్దపల్లి జిల్లా మంథని వద్ద హైకోర్టు న్యాయవాదులను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలనిసమాచార హక్కు సంఘంఆల్ ఇండియా జాయింట్ సెక్రటరీ జువ్వాజీ అంజయ్యగౌడ్ కోరారు . సోమవారం వేములవాడలో సమాచార హక్కు సంఘం సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్ రావు, మరియు ఆయన సతీమణి నాగమణిల నడి రోడ్డులో పట్టపగలు ప్రజలు చూస్తుండగా వేటకొడవళ్లతో దాడి చేసి హత్య చేయడం దారుణం అని, చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చే?శారు.అలాగే న్యాయవాదులు రక్షణ చట్టం రూపొందించి దానిని వెంటనే అమలు పరచాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ సత్వర చర్యలు తీసుకోని శిక్ష పడేలాగా చూడాలని కోరారు. ఈ సమావేశంలో బుర్ర శ్రీనివాస్ సురేందర్, అనీల్ ఆంజనేయులు ,బాబున్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షునిగా మందలలింబయ్య

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 22: (నేటినిజం ప్రతినిధి):కోనరావుపేటగ్రామ కమిటీ అధ్యక్షునిగామందలలింబయ్య ను ఏకగ్రీవంగాఎన్నుకున్నారు.

సోమవారం కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యకర్తల సమావేశం జరిగింది .

అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఫిరోజ్ షా ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే ఉపాధ్యక్షునిగా దుర్గ నారాయణ ,,ఏ. నిత్య నందం,ప్రధాన కార్యదర్శిగా జి. రవి సహాయ కార్యదర్శిగారన రవీందర్ రెడ్డి కోశాధికారిగా తోట మల్లేశంను నియమించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సి హెచ్. గోపాల్ ,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్తన్న హాజరయ్యారు.

ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం తెలుగు వెబ్ ఎడిటర్స్ నియామకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 22:ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం, ప్రాంతీయ వార్తా విభాగం, తాత్కాలిక ప్రాతిపదికన పని చేసేందుకు వెబ్-ఎడిటర్స్ (తెలుగు) కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. హైదరాబాద్ నగరపాలక సంస్థ, జి.హెచ్.ఎమ్.సి పరిధిలో నివసించే వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రాక్టికల్స్ తో కూడిన రాత పరీక్ష అనంతరం - ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు, వివరాల కోసం లిలిలి.నివలిబనీనిజీతితీ.ఇనీఏ వెబ్ సైట్ లో "వేకన్సీ" ట్యాబ్ ను చూడగలరు. దరఖాస్తులను 2021 మార్చి 1వ తేదీ, సాయంత్రం 5 గంటల లోగా అందేలా పంపాలి.

ఓడిపోయే ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తారా?

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఓడిపోయే టికెట్ ఇచ్చి పీవీ కుటుంబాన్ని అవమాన పరిచారని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ఆక్షేపించారు. అభ్యర్థులు లేక పీవీ వాణీదేవికి టికెట్ ఇచ్చారని విమర్శించారు. నామినేషన్ వెనక్కి తీసుకోవాలని వాణీదేవికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గౌరవ ప్రదమైన స్థానం కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. హైదరాబాద్- రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి టీఆర్ఎస్ వాణీదేవి బరిలోకి దింపింది. ఆమెకు టికెట్ ఇవ్వడంపై పలు విమర్శలు వస్తున్నాయి. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్‌ల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్. రామచంద్ర రావుల పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. నామినేషన్‌ల దాఖలు మంగళవారంతో ముగియనుంది.

మంత్రులు వచ్చినా, ముఖ్యమంత్రి వచ్చినా ...

విజయవాడ కార్పోరేషన టిడిపిదే: ఎంపి కేశినేని

విజయవాడ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఎంత మంది మంత్రులు వచ్చినా, ముఖ్యమంత్రి వచ్చినా విజయవాడ కార్పొరేషన్ టీడీపీదేనని టీడీపీ ఎంపీ కేశినేని నాని తెలిపారు. 39వ డివిజన్ అభ్యర్థి నూటికి నూరుశాతం శివశర్మే విజయం సాధిస్తారన్నారు. ఎటువంటి మార్పు లేదని ... విజయవాడకు తాను.. రాష్ట్రానికి చంద్రబాబు అధిష్టానమన్నారు. ఒక కుటుంబంలో ఉన్నప్పుడు అనేక ఇబ్బందులు వస్తు ఉంటాయి.. పోతూ ఉంటాయన్నారు. వైసీపీలో సఖ్యత ఉందా? అని ప్రశ్నించారు. నాలుగు పార్టీలు మారిన మంత్రి మాట్లాడటం విడ్డూరమన్నారు. చదువుకున్న అభ్యర్థులపై 16 కేసులున్న స్టువర్టుపురం దొంగలను నిలుచోపెట్టే చరిత్ర వైసీపీదన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే ప్రజలపై ఒక్క రూపాయి కూడా పన్ను పెంచబోమన్నారు.

పెట్రో ధరలు పెంచిన వాళ్లకు ఓట్లెందుకు వేయాలి

రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): నిత్యావసరాలు, పెట్రో, వంట గ్యాస్ ధరలు భారీగా పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న బీజేపీకి ఓటెందుకు వేయాలని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నల్గొండ - ఖమ్మం-వరంగల్ జిల్లా పట్టబద్రుల నియోజవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి తెలంగాణ ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని యువతకు వీటిని వివరించి ఓటు అభ్యర్థించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బీజేపీ నాయకులు నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని.. చేతనైతే ఢిల్లీలో మాట్లాడాలని అన్నారు. ఇంటింటికీ తాగునీరు, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మిలాంటి పేదలకు ఉపయుక్తమైన పథకాలు ఏ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయో ఆ పార్టీ నాయకులు చెప్పాలని నిలదీశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్న ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. 14.2 శాతం వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే నంబర్‌గా ఉంది. అతి తక్కువ అప్పులు తీసుకున్న రాష్ట్రం కూడా మనదే. మన పథకాలను కాపీ కొట్టి పేర్లు మార్చి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. ప్రజాసమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితో పని చేస్తున్నారని మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభత్వం నుంచి 900 కోట్లు బీఆర్‌జీఎఫ్ నిధులు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ రావాలని, కానీ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం లేదని ఆయన విమర్శించారు. నారాయణ ఖేడ్ వద్ద కర్ణాటక రాష్ట్రంలోని మహిళలు నీళ్ల కోసం తండ్లాడుతున్నారని ఆయన ఆరోపించారు. రైతులు కరెంటు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అడబిడ్డలకు కల్యాణలక్ష్మీ రావడం లేదని ఆయన తెలిపారు. ఇంటింటికి నల్లా ఇచ్చి భగీరథ నీటిని అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. రైతులకు 24 గంటల కరెంటు, రైతు బంధు, రైతు బీమా ఇచ్చి వారిని ఆదుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ ఇచ్చిన ఘనత మన కేసీఆర్‌ది అని ఆయన తెలిపారు. దేశంలో 14.2? వృద్ధి రేటు ఎక్కువగా వున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. సమావేశంలో టీఆర్ఎస్ అభ్యర్థి పల్లారాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించే గొంతుకనవుతానని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1,35,000 ఉద్యోగుల నియామకాలు జరిగాయని పేర్కొన్నారు. త్వరలోనే మరో 50 వేల ఉద్యోగాల భర్తీ జరుగుతుందని పల్లా తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకం కోసమే తెలంగాణ ఉద్యమం జరిగిందన్నారు. ఐటీ రంగంలో రాష్ట్రానికి అధిక కంపెనీలు రావడానికి సీఎం కేసీఆర్ ప్రముఖ పాత్ర వహించారన్నారు. 43 లక్షల మందికి ఆసరా పథకం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఆయన తెలిపారు. 60 లక్షల మందికి రైతు బంధు అందిస్తున్నామన్నారు. చెరువులు, కుంటలను కాళేశ్వరం నీళ్లతో నింపుకున్నామన్నారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిందన్నారు. సొంత స్థలంలో ఇల్